క్లుప్తంగా

భద్రకాళికి రాహుకాల పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి అత్యంత భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ఆలయ ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరయ్య స్వామి అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అలాగే అమ్మవారికి మహిళలు నిమ్మకాయలపై ఒత్తులు వెలిగించి హారతులుపట్టారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు



హుండీని తెరుస్తున్న అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి – రాజంపేట సర్కిల్ (సుండుపల్లె క్రాస్ వద్ద) వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.43,554లుగా లెక్కించారు. శుక్రవారం ఆలయంలోని ప్రధాన హుండీలను లెక్కించారు. ఇందులో ఈ మొత్తం లెక్కించి రాయచోటి గ్రామీణ బ్యాంక్‌లో నూతనంగా ఖాతా తెరిచి అందులో జమ చేసినట్లు రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి తెలిపారు. గతంలో వివాదంతో నడుస్తున్న ఆ ఆలయ ఆదాయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో జిల్లా కలెక్టర్ తమకు బాధ్యతలు అప్పగించడంతో ఆలయ పాలనా వ్యవహారాలను స్వీకరించినట్లు తెలిపారు.

రేషన్ డీలర్లకు స్మార్ట్‌కార్డులు అందజేత



రేషన్ డీలర్లకు స్మార్ట్‌కార్డులను అందిస్తున్న తహసీల్దార్ తిరుమలబాబు

సిద్దవటం : ప్రతి ఒక్క లబ్ధిదారుకు రేషన్ అందే విధంగా స్మార్ట్‌కార్డులు ఉపయోగపడతాయని తహసీల్దార్ ఆకుల తిరుమలబాబు పేర్కొన్నారు. సిద్దవటంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్‌షాపుల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 21 చౌక దుకాణాల డీలర్లతో సమావేశం ఏర్పాటు చేసి 10,893 స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశామన్నారు. చౌక దుకాణం పరిధిలో ఉన్న వయోవృద్ధులు, దివ్యాంగులకు నెలసరి రేషన్ వారి ఇంటి వద్ద పంపిణీ చేపడతారని తెలియజేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సౌజన్య, వీఆర్‌ఓలు, రేషన్‌షాప్ డీలర్లు పాల్గొన్నారు.

దీన్ దయాల్‌కు నివాళి



దీన్ దయాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాయచోటి టౌన్ : భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ వ్యవస్థాపకుడు దీన్ దయాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాయచోటి బీజేపీ కార్యాలయంలో జిల్లా అధికార పార్టీ ప్రతినిధి పాలగిరి డాక్టర్ శ్రీనివాసరాజు, రాయచోటి నియోజకవర్గ అసెంబ్లీ కో–కన్వీనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీన్ దయాల్ సిద్ధాంత స్ఫూర్తితో పార్టీని మరింత బలోపేతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో రాయచోటి పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానసిక రుగ్మతలను నివారించాలి

కడప అర్బన్ : మానసిక రుగ్మతలను నివారించాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది శాంత పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప సూచనలతో కడప రిమ్స్ ఆవరణలోని జిల్లా సత్వర చికిత్స కేంద్రంలో మానసిక ఆరోగ్య సంస్థలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రత్యేక పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నంబర్ 15100, ఉచిత న్యాయ సహాయంపై వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు, పిల్లలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి చేయాలి

సంబేపల్లె, చిన్నమండెం మండలాల్లో శ్రీకాంత్‌రెడ్డి విస్తృత పర్యటన



చిన్నమండెం: కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డి

చిన్నమండెం : వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి చిన్నమండెం మండలంలో శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. చిన్నమండెం, బెస్తపల్లి, చిన్నర్సుపల్లెలలో శ్రీకాంత్‌రెడ్డి ప్రజలు, కార్యకర్తలతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డిలతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజలను పేరుపేరునా ఆప్యాయంగా పలుకరించారు. ప్రజల కష్ట, నష్టాలపై చర్చించారు. సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందామని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, తిమ్మారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ చుక్కా అంజనప్ప, మండల ఉపాధ్యక్షుడు ఏజాజ్ అలీఖాన్, కోఆప్షన్ గౌస్‌సాబ్, ఎంపీటీసీలు రమేష్, రెడ్డప్ప, రమణయ్య, సర్పంచులు లోకేశ్వర్‌రెడ్డి, అఫ్రోజ్, నజీర్‌అహమ్మద్, రామమూర్తి, సుధాకర్, నాయకులు నాగేశ్వరరెడ్డి, రెడ్డప్పరెడ్డి, జహీర్‌ఖాన్, బుర్హాన్‌ఖాన్, సిబకతుల్లాఖాన్, అజార్, సజ్జాద్, రామాంజులురెడ్డి, శివారెడ్డి, శివా, గురుదేవ, రమణ, సీతాపతిరెడ్డి, ఖాజా ఖాన్, సుదర్శన్‌బాబు, వేణుగోపాల్ నాయుడు, సురేంద్రారెడ్డి, మురళి, పవన్, వెంకటేశ్వర్లు, గుర్రయ్య, రమణయ్య, వెంకటనారాయణ, రాజు, రమణయ్య, వెంకట్రాయుడు, ఆంజనేయులు, రాఘవ, వెంకటరమణ, రమణయ్య, విష్ణు, ధనాంజి, సుధాకర్, వెంకటరెడ్డి, శ్రీనాథ్, కదిరప్ప, వెంకటయ్య, రెడయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చిన్నమండెం మండలం పొలిమేరపల్లి గ్రామం బెస్తపల్లెలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ చిన్నమండెం మండల కన్వీనర్ జేసీబీ శేఖర్ కుటుంబాన్ని శుక్రవారం గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దేవనాథరెడ్డి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డిలు పరామర్శించారు.



సంబేపల్లె: నాయకులతో కలిసి రహంతుల్లాను పరామర్శిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

శేఖర్ మాతృమూర్తి ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో స్థానిక నాయకులతో కలిసి వారు బెస్తపల్లికు వచ్చి పరామర్శించారు. ఆమె మృతి పట్ల సంతాపం తెలిపారు. అనంతరం మండలంలోని చిన్నర్సుపల్లెలో మాజీ డీలర్ నరసింహులును నాయకులు ఆత్మీయంగా పలుకరించారు. అలానే మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ ఏజాజ్ అలీఖాన్ ఏర్పాటు చేసిన తేనేటి విందులో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంబేపల్లె మండలం శెట్టిపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీలో నెలకొన్న సమస్యలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆరాతీశారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథరెడ్డిలతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా డీసీ వడ్డిపల్లెకు చెందిన రమణ వివాహ వేడకకు గడికోట హాజరయ్యారు. అనంతరం శెట్టిపల్లె కస్పాకు చెందిన రహంతుల్లా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి రహంతుల్లాను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, ఆనంద్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శివయ్య, నాయకులు జయనారాయణరెడ్డి, శంకర్ నాయుడు, జాఫర్‌ఖాన్, మహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించండి



క్షేత్రస్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లి : విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని పరిశ్రమల శాఖ అధికారి సరిత పేర్కొన్నారు. ఏపీ మోడల్ స్కూల్‌లో ఆటోమోటివ్ విభాగ విద్యార్థులు గురువారం లక్కిరెడ్డిపల్లిలోని రాజేష్ గ్యారేజ్‌లో రెండు రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సరిత పరిశీలించి మాట్లాడారు. పిల్లల్లో కొత్త జ్ఞానం, ప్రేరణ, భవిష్యత్తు లక్ష్యాలపై స్పష్టత కల్గి ఉండాలని, విద్యతో పాటు వృత్తి విద్యలోనూ సొంతకాళ్ల మీద నిలబడే పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. ఆటో మొబైల్ వాహనం సర్వీస్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేష్, విద్య సమన్వయకర్త ప్రదీప్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగాస్టార్‌కు బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలి



రాజశేఖర్ రాయల్

ఒంటిమిట్ట : హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ ఒక మానసిక రోగి అంటూ ఒంటిమిట్ట మండల ప్రచార విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ రాయల్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ మానసిక రోగి అని 2004 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయస్థానం అప్పట్లోనే తీర్పునిచ్చిందన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు హిందూపురానికి ఎమ్మెల్యేగా ఎన్నికై సైకోలా ప్రవర్తిస్తున్నాడని ఆరోపించారు. అభిమానులను, స్థానిక ప్రజలను కొడుతుండటాన్ని ప్రజలు చూశారన్నారు. రాజ్యాంగ దేవాలయమైన అసెంబ్లీలో తెలుగు ప్రజల అభిమాన నటుడు, మెగాస్టార్ చిరంజీవిని కించపరిచేలా వ్యాఖ్యానించడం రాష్ట్ర ప్రజలను ఎంతగానో కలచివేసిందన్నారు. కాపు సామాజిక వర్గ ఐకాన్ అయిన చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని మండిపడ్డారు. మెగాస్టార్ చిరంజీవికి బాలకృష్ణ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో మద్యం సేవించిన వ్యక్తిలా, మాట్లాడటం చేతకాని బాలకృష్ణ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి ఆరోపణలు చేయడం ఆయన అహంకారానికి అద్దం పడుతోందని, తీరు మారకుంటే ప్రజలు ఎక్కడ కొట్టాలో అక్కడ కొడతారని రాజశేఖర్ రాయల్ తెలియజేశారు.

రైతులు నానో ఎరువులను వాడాలి



మాట్లాడుతున్న అధికారి మణిచంద్ర

చిట్వేలి : నానో ఎరువుల వాడకంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చని అన్నమయ్య జిల్లా విప్కో అధికారి మణి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీలక్ష్మీ శ్రీనివాస పరస్పర సహకార సంఘం ఎరువుల దుకాణంలో నానో ఎరువులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మణిచంద్ర మాట్లాడుతూ వ్యవసాయం సులభతరం కావాలన్నా నానో టెక్నాలజీ ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో దుకాణం యజమాని కొండూరు కృష్ణంరాజు, విప్కో ఉద్యోగి భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న సిద్దిగాళ్ల శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి టౌన్ సమీపంలోని ఒకటి, నాలుగు వార్డులలో సీపీఐ బృందం నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, సీపీఐ మండల కార్యదర్శి కె.ఓబులేశు, సహాయ కార్యదర్శి జగదీష్, నియోజకవర్గ సభ్యుడు కె.సురేంద్రలు శుక్రవారం పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పాత నియోజకవర్గ కేంద్రం అయినప్పటికీ అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. ఇందుకు నిదర్శనం గత ఇరవై సంవత్సరాల క్రితం వేంపల్లి రోడ్డు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల కడప రోడ్డు వరకు మట్టితో బైపాస్ రోడ్డు వేశారని, వర్షం కురవడంతో పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న బైపాస్ రోడ్డుకు సీసీ రోడ్డుగా మంజూరు చేయాలని కోరారు. అలాగే టెండర్ డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, సీసీ రోడ్లు, ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఏర్పాటు చేయాలని లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.ఓబులేశు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు సురేంద్ర, మండల సహాయ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల ప్రైవేటీకరణను కేంద్రం అడ్డుకోవాలి



యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి

రాయచోటి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ అడ్డుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథ్‌రెడ్డి ఆరోపించారు. ఈ విధానం వలన పేద, మధ్య తరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మెడికల్ కళాశాలలో 10 వేల సీట్లు పెంచడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వలన వైద్య విద్య సామర్థ్యం పెరిగి ఎక్కువ మంది స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులోకి వస్తారన్నారు. 2028–2029 సంవత్సరానికి దేశ వ్యాప్తంగా పీజీలో 5 వేలు, 5023 ఎంబీబీఎస్ సీట్లు పెంచడం జరిగిందన్నారు. ఒకొక్క సీట్‌కు మౌలిక వసతుల కల్పనకు రూ.1.20 కోట్లు ఖర్చు చేయగా అభినందనీయమన్నారు. అలానే రాష్ట్రంలో ప్రభుత్వమే మెడికల్ కాలేజీలు నిర్వహించే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు.

28న రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ

మదనపల్లె రూరల్ : మాలల జేఏసీ, మాల ఉద్యోగుల సంఘం, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ప్రారంభమైన పాదయాత్ర 28వ తేదీ ఆదివారం ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందని మాలమహానాడు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం అన్నారు. శుక్రవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...భారత రాజ్యాంగం మనువాదుల చేతుల్లో బందీ కాబోతుందన్నారు. ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయంగా ఉన్న భారత రాజ్యాంగాన్ని పక్కనపెట్టి పాలకులు మనువాద రాజ్యాంగం అమలుకు కృషి చేస్తున్నారన్నారు. వర్గీకరణ పేరుతో మాలమాదిగలను నిట్టనిలువునా చీల్చారన్నారు. ఈ పరిస్థితిలో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అంబేద్కర్‌వాదులపై ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా నిర్వహిస్తున్న పాదయాత్రకు మాలలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు గుండామనోహర్, యమలా చంద్రయ్య, మల్లెలమోహన్, హరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

మదనపల్లె రూరల్ : స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య(వెలుగు) కార్యాలయంలో ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని 15 మండలాల క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ)లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ నాగేశ్వరరావు మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు మహిళలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకువస్తాయని, ఆన్‌లైన్ ద్వారా రుణాలు పొందడం, ప్రభుత్వ సహాయాన్ని అందుకోవడం సులభతరమవుతుందన్నారు. మహిళా సంఘాల సభ్యుల సామాజిక భద్రత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, బ్యాంకులు అందిస్తున్న రుణాలు, బీమా పథకాలపై పూర్తిస్థాయిలో వివరించారు. అలానే ఆర్థిక మోసాల పట్ల జాగ్రుతిగా వ్యవహరించాలని తెలియజేశారు. తెలియని నంబర్ల నుంచి మెసేజ్‌లు వస్తే ఓపెన్ చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మీప్రసాద్, సాంబశివ, జి.మంజు, ఎస్.అలివేలు, లీగల్ కోఆర్డినేటర్ గంగాధర్, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలి

గాలివీడు : పేదరికంలేని మెరుగైన జీవనం సాగించే దిశగా గ్రామాల అభివృద్ధి జరగాలని ఎంపీడీఓ చంద్ర మౌళీశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ రాజ్ సూచిక 2.0పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఆరోగ్యకరమైన, పచ్చదనం, నీటి సమృద్ధి గల మౌలిక సదుపాయాలు గల గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. అంతేగాక సామాజిక న్యాయం, సుపరిపాలన, మహిళా స్నేహపూర్వక గ్రామాలే లక్ష్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : అధికారులు గ్రామల అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీఓ జాషువా తెలియజేశారు. శుక్రవారం రామాపురం మండల కేంద్రంలోని మండల పరిషత్ సభా భవనంలో సర్పంచులు, ఎంపీటీసీలకు, మండల శాఖ అధికారులు, గ్రామ కార్యదర్శులకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 9 టీంలు ఏర్పాటు చేశామని, ఆ టీంలు గ్రామాల అభివృద్ధి పథంలో పయనించేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



పెనగలూరు: అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ విజయారావు

పంచాయతీ పురోగతిపై శిక్షణా తరగతులు

పెనగలూరు : పంచాయతీ పురోగతి సూచికపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ విజయారావు తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలియజేశారు. ఆరోగ్యకరమైన, బాలల స్నేహపూర్వక, నీటి సమృద్ధి, పచ్చదనం, మహిళా స్వేచ్ఛ, సామాజిక న్యాయం – భద్రత గల పంచాయతీలుగా గ్రామాలను తీర్చిదిద్దినట్లెతై అవార్డు అందుకునేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుబ్బరాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



రాయచోటి జగదాంబ సెంటర్: రామాపురం మండలంలో సిబ్బందికి ఎంపీడీఓ సూచనలు

హంద్రీ-నీవా జలాలు విడుదల చేయాలని వినతి

మదనపల్లె రూరల్ : చెరువులకు హంద్రీ–నీవా జలాలను విడుదల చేయాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో చెరువులకు హంద్రీనీవా జలాలను మళ్లించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ... హంద్రీనీవా జలాలను చెరువులకు మళ్లించడం వల్ల భూగర్భజలాల పెంపు జరుగుందని, వేసవిలో సాగు,తాగునీటి అవసరాలకు కొరత లేకుండా ఉంటుందన్నారు. పర్యావరణ సమతుల్యత పెరుగుతుందన్నారు. వర్షాభావం కారణంగా స్థానికంగా నీటి ఎద్దడి నెలకుందని, హంద్రీనీవా కాలువలో వెళుతున్న కృష్ణా జలాలను స్థానిక ప్రజలు, రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణి రాజకుమారి

సిద్దవటం : గ్రామాల అభివృద్ధికి పంచాయతీ సెక్రటరీలు దృష్టి పెట్టి విధి నిర్వహణ పట్ల అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీఓ ఫణి రాజకుమారి సూచించారు. సిద్దవటం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీలలో ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ముఖ్యంగా గ్రామ పంచాయతీలో అపరిశుభ్రత లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. అందుకు పంచాయతీ కార్యదర్శులకు గ్రామ ప్రజలు కూడా సహకరించాలని తెలిపారు. ప్రతి సోమవారం గ్రామ సచివాలయాల్లో సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని తెలియజేశామన్నారు. ఫీల్డ్ వర్క్‌కు వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ వేసి మూమెంట్స్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి మెహతాబ్ యాస్మిన్, విద్యాశాఖ అధికారి–2 అరుణ, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఉపాధి హామీ ఏపీఓ నరసింహులు, వెలుగు ఏపీఎం సుజాత, అంగన్వాడీ సూపర్‌వైజర్లు శ్రీవిద్య, వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మోహినీ మాతా నమోస్తుతే

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. రాజంపేట అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి మోహినీదేవిగా దర్శనమిచ్చారు. అలానే అమ్మవారి ఆలయాల్లో మూలవిరాట్‌లకు విశేష పూజలు చేశారు. నవరాత్రుల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయ కమిటీలు భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట రూరల్: అమ్మవారికి పూజలు చేయిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి




రాజంపేట టౌన్: విశాలాక్షీ దేవిగా వీరచాడేశ్వరీదేవి



చిట్వేలి: మోహినీ అలంకారంలో వాసవాంబ



సిద్దవటం: గజలక్ష్మీదేవి అలంకరణలో శ్రీ గంగాభవానీ



నందలూరు: మోహినీదేవి అలంకారంలో కన్యకాంబ




చిన్నమండెం: శ్రీ జగన్మోహినీదేవి అలంకారంలో..



రాయచోటి టౌన్: బాలా త్రిపుర సుందరీగా వాసవీ మాత



రాజంపేట టౌన్: లలితాంబికగా మారెమ్మ



పెనగలూరు: మహాలక్ష్మీదేవి అలంకారంలో కామాక్షి మాత



రాయచోటి జగదాంబ సెంటర్: శ్రీ అగస్త్యేశ్వరాలయంలో..



చిట్వేలి: అమ్మవారి తులాభారం




రాయచోటి టౌన్: గాయత్రీ దేవి రూపంలో ఉమామహేశ్వరీ



రామాపురం: పార్వతీదేవిగా దర్శనమిస్తున్న దర్గా మాతాజీ



సుండుపల్లె: శ్రీ లక్ష్మీదేవి అలంకారంలో వాసవీదేవి



ఒంటిమిట్ట: అలంకారంలో దర్శనమిస్తున్న వాసవీ మాత



గాలివీడు: శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా ఇరుగులమ్మ